తెలంగాణ స్టేట్ టీటీ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి : తెలంగాణ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెయింట్ పాల్స్ హైస్కూల్ వేదికగా జరిగిన రాష్ట్ర టీటీ చాంపియన్‌షిప్‌లో మైరా జైన్ విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన టోర్నీ బాలికల అండర్-11 ఫైనల్లో మైరా జైన్ 7-11, 11-9, 15-17, 11-7, 14-12తో అవియాశ్‌పై గెలిచి టైటిల్ దక్కించుకుంది. బాలికల అండర్-15 ఫైనల్లో అనియా ఆనంద్ 11-7, 11-13, 6-11, 11-7, 11-8తో శ్రీ సాన్విపై గెలిచింది. బాలుర అండర్-15 ఫైనల్లో శ్రీ అనిశ్, బాలికల అండర్-17లో సత్య అస్పతి, బాలుర విభాగంలో ఆరుశ్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరైన టీఎస్ఎస్‌టీఏ అధ్యక్షుడు కేకే మహేశ్వరి విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

నేడు బెంగళూరుకు హైడ్రా బృందం

చెరువుల పునరుజ్జీవం పై రెండురోజుల స్టడీటూర్

సిటీబ్యూరో, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): హైడ్రా కమిషనర్ రంగనాథ్ రెండురోజుల స్టడీటూర్‌కు బెంగళూరు వెళ్తున్నారు. గురువారం నుంచి రెండురోజుల పాటు హైడ్రా కమిషనర్‌తో పాటు అధికారులు ఈ బృందంలో ఉన్నారు. బెంగళూరులో ఈ రెండురోజులు రెండు సమావేశాలతో పాటు నాలుగు చెరువులను పునరుజ్జీవం చేసిన విధానంపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. లేక్ మ్యాన్ ఆనంద్ మల్లిగవాడతో సమావేశమవుతారు. చెరువుల పునరుద్ధరణ తక్కువ ఖర్చుతో ఎలా చేయవచ్చు, మురుగునీటిని ఎలా శుద్ధి చేయవచ్చు అనే అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. ఆ తరువాత ఆనంద్ ఆధ్వర్యంలో పునరుజ్జీవం జరిగిన చెరువులను సందర్శిస్తారు. మరోవైపు బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో సెన్సార్ల వాడకంతో జరుగుతున్న ప్రయోజనాలపై అక్కడి అధికారులతో మాట్లాడుతారు. బెంగళూరు పర్యటనకు వెళ్తున్న బృందంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు ఉన్నారు. బెంగళూరు నుంచి వచ్చిన తర్వాత తమ పైలట్ ప్రాజెక్ట్‌లో ఉన్న ఎర్రగుంట చెరువు, నల్ల చెరువు, సున్నం చెరువు, అప్పచెరువులకు సంబంధించి పునరుజ్జీవం, సుందరీకరణ అంశాలపై నివేదిక తయారు చేస్తామని, తమ పర్యటనలో ఎక్కడైతే తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు జరిగాయో వాటిని ఈ పాజెక్ట్ రిపోర్ట్‌లో పొందుపరుస్తామని వారు చెబుతున్నారు.

శ్రీచైతన్య సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డు

3 గంటల్లో 600 మ్యాథ్స్ ఫార్ములాల పఠనం

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): దేశ ప్రముఖ విద్యా సంస్థగా పేరుగాంచిన శ్రీచైతన్య విద్యా సంస్థ మరో మైలురాయిని అధిగమించిందని శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. బుధవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో 20 రాష్ట్రాల నుంచి పదివేల మంది శ్రీ చైతన్య విద్యార్థులు పాల్గొన్నారు. వీరంతా 3 గంటల్లో 600 మ్యాథ్స్ ఫార్ములాలు ఏకకాలంలో పఠించి ప్రపంచ రికార్డు సృష్టించారని తెలిపారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులు 3 నుంచి 10 సంవత్సరాల లోపు చిన్నారులేనని, ఈవెంట్‌కు యూకేలోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు ప్రత్యక్ష సాక్షిగా నిలిచారన్నారు. శ్రీచైతన్య విద్యా సంస్థకు సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్ పథకాన్ని ప్రదానం చేశామని సీమ వెల్లడించారు.

సాహిత్యాంశాల్లో విజేతల ఎంపిక పూర్తి

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 6: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పలు అంశాల్లో నిర్వహించిన పోటీల విజేతలను ఎంపిక చేసినట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరి శాంతమ్మ స్మారక కథ, వచన కవిత, పద్య కవిత, చిత్రలేఖనం అంశాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 80 పాఠశాలలకు చెందిన 750 మంది విద్యార్థులు రచనలు పంపించారని వెల్లడించారు. న్యాయ నిర్ణేతలు 59మందిని రూ.500ల చొప్పున నగదు బహుమతులకు, మరో 76 మందిని రెండో శ్రేణిలో ప్రత్యేక ప్రశంస కింద జ్ఞాపికతో సత్కరించేందుకు ఎంపిక చేశారు. ఈ నెల 15న ఉదయం జరుగనున్న బాలల సాంస్కృతికోత్సవం రోజు పాటలు, వక్తృత్వం, పుస్తక సమీక్షా రచన, ఏకపాత్రాభినయం, వ్యాసరచన అంశాల్లో పోటీలు నిర్వహించి అప్పటికప్పుడే వేదికపై బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సులకు దరఖాస్తులు

కాచిగూడ,నవంబర్ 6: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ కోర్సులకు ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటాసైన్స్, బిగ్‌డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన వారు అర్హులని, ఈ నెల 15 వరకు www.nationalskillacademy.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 95058 00050 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా బొల్లం జ్యోతి

మల్లాపూర్, నవంబర్ 6 : తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కాప్రా సర్కిల్ మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన బొల్లం జ్యోతి మాదిగ నియమితులయ్యారు. బుధవారం జరిగిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య బొల్లం జ్యోతికి నియామక పత్రం అందజేశారు. తనను రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర నాయకుడు బాబు మాదిగ, యాదగిరి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు లాజర్, జాతీయ అధ్యక్షురాలు రుక్మమ్మ, ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మలకు జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

బొల్లం జ్యోతికి నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య

శివారులో విద్యుత్‌కు డిమాండ్

- కొత్త నెట్‌వర్క్ ఏర్పాటు చేయని డిస్కం
- సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రతిపాదనలకే పరిమితమైన అధికారులు

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరం ఓఆర్ఆర్‌ను దాటి వేగంగా విస్తరిస్తోంది. దీంతో పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ముఖ్యంగా అత్యవసర సర్వీసుల్లో ఒకటైన విద్యుత్ సరఫరాను విస్తరిత ప్రాంతాలకు అందించడంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) విఫలమవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భవిష్యత్ డిమాండును ముందుగానే అంచనా వేసి క్షేత్రస్థాయిలో మెరుగైన రీతిలో విద్యుత్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. సబ్ స్టేషన్‌లు మొదలు కొని, 11 కేవీ ఫీడర్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ లైన్లను వేశారు. దీంతో అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చి, నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా నెట్‌వర్క్‌ను తీర్చిదిద్దారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ సరఫరాపై నిర్లక్ష్యం వహిస్తున్నది. దాని ఫలితమే గత వేసవి నుంచి మొదలు కొని వర్షాకాలం వరకు తరచూ విద్యుత్ కోతలు, అంతరాయాలతో నగర వాసులు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. దీనికి ప్రధాన కారణం విద్యుత్ డిమాండుకు అనుగుణంగా నెట్‌వర్క్‌ను విస్తరించకపోవడమే. డిస్కం కొన్ని నెలల క్రితం చేపట్టిన ఫీడర్ల సర్వేలోనూ అప్పటికే వినియోగంలో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్‌పై ఓవర్‌లోడ్ పెరిగిందని గుర్తించింది. దానికి వెంటనే శాఖాపరంగా నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచాల్సిందిపోయి, విద్యుత్ వినియోగదారులపైనే భారం వేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నది.

శివార్లలో గణనీయమైన డిమాండ్

నగర శివారు ప్రాంతాల్లోనే విద్యుత్ డిమాండు గణనీయంగా పెరిగింది. సైబర్ సిటీ సర్కిల్, రాజేంద్రనగర్, మేడ్చల్, హబ్సిగూడ, సరూర్‌నగర్, సంగారెడ్డి సర్కిళ్లలో కొత్తగా నివాసాలతో పాటు పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. వాటికి విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చేలా క్షేత్ర స్థాయిలో లేకపోడంతో జారీ చేయడం లేదు. ముఖ్యంగా అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులు, వ్యక్తిగత గృహాలు కోర్ సిటీ కంటే శివారు ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటున్నాయి. శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోనే డిమాండు ఎక్కువగా ఉంటోందని విద్యుత్ శాఖ అధికారులే చెబుతున్నారు. సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో సుమారు 92 ప్రాంతాల్లో కొత్తగా 11కేవీ ఫీడర్ లైన్లు వేయాల్సి ఉందని ఓ అధికారి తెలిపారు. ఇలా శివారు సర్కిళ్లలో రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్, సంగారెడ్డి సర్కిళ్లలో వందల సంఖ్యలో ఫీడర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వీటితో పాటు కొత్తగా వేల సంఖ్యలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా డిస్కం ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో అత్యవసరమైన విద్యుత్ నెట్ వర్క్‌ను ఏర్పాటు చేయాలని శివారు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

గ్రేటర్ పరిధిలో ఉన్న విద్యుత్ సర్కిళ్లు..

1. హైదరాబాద్ సెంట్రల్
2. హైదరాబాద్ సౌత్
3. సికింద్రాబాద్
4. బంజారాహిల్స్
5. సైబర్ సిటీ
6. రాజేంద్రనగర్
7. సరూర్‌నగర్
8. హబ్సిగూడ
9. మేడ్చల్
10. సంగారెడ్డి

రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో పాదయాత్ర చేయాలి

- ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

చెక్కులు అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, నవంబర్ 6 : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగాలని, అలా కాకుండా పేద ప్రజల ఇండ్ల మీదకు బుల్డోజర్లు పంపించి కూల్చివేయడం చాలా దారుణమని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేయబోయే పాదయాత్ర నల్లగొండ నుంచి కాకుండా హైదరాబాద్‌లోని మూసీ పక్క నుంచి చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్లకు చెందిన 54 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా లక్ష రూపాయల చెక్కుతో పాటు తులం బంగారం ఇచ్చి.. కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలన్నారు. ఆడబిడ్డకు ఆసరా ఉంటుందనే ఉద్దేశంతోనే అప్పటి సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను తీసుకొచ్చారన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 11నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ తీసుకొచ్చిన కేసీఆర్ కిట్టు,న్యూట్రిషన్ కిట్టు ఆపకుండా ఇవ్వాలన్నారు. రూ.44లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉంటే 22లక్షల మంది రైతులకు చేసి అందరికి చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రస్తుతం చేస్తున్న కుల గణన పారదర్శకంగా చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ హయాంలో సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మించిన నూతన భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవిందర్‌శర్మ, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు నగేశ్, నియోజకవర్గ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ఏ,సాజీద్, రామ్‌నరసింహ, పెంబర్తి శ్రీనివాస్, రాజేశ్ గౌడ్, శేఖర్, రమేశ్ కురుమ, స్వప్నారెడ్డి, రిషి పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల బాధ్యత జేఏసీదే

సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్

చిక్కడపల్లి, నవంబర్ 6: భాగ్యనగర్ టీఎన్‌జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇండ్ల స్థలాలు ఇప్పించే బాధ్యత జేఏసీదేనని టీఎన్‌జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో బుధవారం భాగ్యనగర్ టీఎన్‌జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముత్యాల సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మారం జగదీశ్ మాట్లాడుతూ.. సొసైటీలో సభ్యులందరూ సంఘటితంగా ఉండాలని సూచించారు. సొసైటీ పట్ల తప్పుడు ప్రచారం చేస్తున్న వారి ప్రయత్నాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కొంత మంది కోర్టుల్లో కేసులు వేయడంతో మరింత ఆలస్యమవుతుందని పేర్కొన్నారు. సొసైటీ స్థలం ఎప్పటికైనా సభ్యులకే చెందుతుందని, త్వరలోనే ప్రభుత్వం నుంచి తీపి కబురు అందుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ సమావేశంలో టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, కస్తూరి వెంకటేశ్వర్, సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, జి.రాజేశ్వర్ రావు, ఎ.శ్రీనివాస, ఎస్. ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎం.శ్రీనివాస్ రావు, ఎస్.సంధ్యారాణి, జె.అమర జ్యోతి, విష్ణువర్ధన్ రెడ్డి, దామోదర్ పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్‌పై అసత్య ప్రచారం మానుకోవాలి

సిటీబ్యూరో, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): బ్రహ్మకుమారీస్‌పై సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని వారు ఒక ప్రకటనలో తెలిపారు. తమ పంస్థ సోదరభావన నైతిక విలువలతో కూడిన సనాతన హిందూధర్మాన్ని పునఃస్థాపన చేయడానికి, ఏకైక ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయంగా కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. కొంతకాలంగా బ్రహ్మకుమారీస్ సంస్థపై, సభ్యులపై రకరకాల నిందలు, అపోహలు, వ్యతిరేక భావ వ్యక్తీకరణ, దూషణలు చేస్తూ పలు ప్రచార సాధనాలు, సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రపంచంలోనే పేరున్న ఆధ్యాత్మిక సంస్థగా ఉన్నదన్నారు. ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశం ప్రపంచంలోని ప్రతీవ్యక్తి మానసిక ప్రశాంతత ఆనందమయ జీవనం గడపాలని, బ్రహ్మకుమారీస్ కార్యకలాపాలను చూసి ఐక్యరాజ్యసమితి వివిధ విభాగాల్లో సలహాదారు స్టేటస్ కూడా ఇచ్చారని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ నుంచి వేర్వేరు పలువురు వేరే సంస్థలు నెలకొల్పి సమాజం సిగ్గుపడే విధంగా నడిపిస్తున్నారని వారితో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు. తమపై అసత్యప్రచారం చేసే సంస్థలు, వ్యక్తులు తమను అర్థం చేసుకోవాలని కోరారు.

పునరావాసం తర్వాతే సుందరీకరణ

- సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి
- మూసీ బాధితులకు న్యాయం చేయాలని సంతకాల సేకరణ

సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాశం యాదగిరి, దిడ్డి సుధాకర్

చిక్కడపల్లి, నవంబర్ 6: మూసీ అత్యంత కలుషితమైన నదుల్లో ఒకటిగా మార్చిన ఫార్మా మాఫియాను కూల్చి, పునరావాసం కల్పించిన తరువాతే పేదల ఇండ్లు కుల్చాలని సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసీ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వారికి మద్దతుగా లిబర్టీ చౌరస్తాలో బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ నిర్వహించిన సామూహిక సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పాశం యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర శివారుల్లోని ఫార్మా కంపెనీలు, పరిశ్రమల వ్యర్థాలను యథేచ్ఛగా మూసీలోకి వదలుతున్నారని తెలిపారు. వాటిని నియంత్రించే చర్యలు తీసుకోకుండా మూసీనది ప్రక్షాళన, సుందరీకరణ ఎలా చేపడుతారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజల జీన ప్రమాణాలు ఎలా కాపాడుతారని అన్నారు. మూసీనది కాలుష్యం నుంచి ప్రజలను రక్షించడానికి ముందుగా ప్రభుత్వం చర్యలు చేపట్టి, నది ప్రక్షాళన, నీటిని మెరుగు పరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. మూసీ నది పునరుజ్జీవనం కోసం నదీతీర పేదలకు హాని కలిగించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. ముందుగా మూసీ బాధితులకు పునరావాసం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు రాములు గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ, దివ్యాంగుల కమిటీ చైర్మన్ రమేశ్, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, నేతలు సుధారాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి టీజీ క్యాబ్ విరాళం

ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి టీజీ క్యాబ్, డీసీసీబీ, సొసైటీ(పీఏసీఎస్) ఉద్యోగుల వేతనం కోటి యాభై లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, టీజీ క్యాబ్ డైరెక్టర్‌లు, యూనియన్ నాయకులతో కలిసి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం రూ. కోటీ 51లక్షల 1116 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీ క్యాబ్ వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, డైరెక్టర్‌లు దేవేందర్ రెడ్డి, బోజారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రమేశ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు టీజీ క్యాబ్, డీసీసీబీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. – సుల్తాన్‌బజార్, నవంబర్ 6

విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని శంషాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, అఖిలపక్షం నాయకులు

విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

శంషాబాద్‌లో భారీ ర్యాలీ

శంషాబాద్ రూరల్, నవంబర్ 6 : దేవాలయంలోని విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వీహెచ్‌పీ, అఖిలపక్షం డిమాండ్ చేసింది. బుధవారం శంషాబాద్‌లో వీహెచ్‌పీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మంగళవారం తెల్లవారుజామున శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టు కాలనీ హనుమాన్ దేవాలయంలోని నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి పాత పోలీస్‌స్టేషన్, పాత శంషాబాద్, తహసీల్దార్ కార్యాలయం, మహావీర్‌కాలనీ, ఆర్బీనగర్, మధురానగర్ కాలనీల మీదుగా శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏసీపీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయంలో ధ్వంసం చేసిన విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వమే పునర్ నిర్మాణం చేయాలన్నారు. దాడులు నిర్వహించి హిందువుల మనోభావాలను దెబ్బతిస్తున్న వారిని శిక్షించే వరకు ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ర్యాలీలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ సతీశ్, మోహన్‌రావు, శ్రీనివాస్, రాజేందర్, కొన్నమొల్ల శ్రీనివాస్, వేణుగోపాల్, బీజేవైం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, కుమార్, నందకిశోర్, కౌన్సిలర్లు వెంకటేశ్, అమృతారెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

శంషాబాద్ బంద్ ప్రశాంతం..

విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ వీహెచ్‌పీతో పాటు అఖిలపక్షం బంద్‌కు పిలుపునివ్వడంతో పాఠశాలలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించినట్లు సీఐ బాలరాజు తెలిపారు.

సివిల్స్ సాధిస్తున్న తెలుగు అభ్యర్థులు

సదస్సును ప్రారంభిస్తున్న కళాశాల డెరెక్టర్ జంగారెడ్డి, ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణ ప్రదీప్ తదితరులు

మేడ్చల్, నవంబర్ 6 : సివిల్స్ సాధనలో తెలుగు రాష్ట్రాల నుంచి అభ్యర్థులు ముందంజలో ఉన్నారని 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ కృష్ణ ప్రదీప్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ ఆడిటోరియంలో సీఎంఆర్ ఐటీ కళాశాల విద్యార్థులకు సివిల్స్ సాధనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యూపీఎస్సీ సాధించి, ప్రభుత్వ సర్వీసుల్లోకి రావాలనే కోరిక చాలా మందిలో ఉన్నదని, కానీ సరైన మార్గదర్శకత్వం దొరకడం లేదన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు సరైన మార్గదర్శకత్వంలో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే తొలి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించవచ్చన్నారు. దేశాన్ని ముందుకు నడిపించేది ఐఏఎస్, ఐపీఎస్‌లేనని చెప్పారు. 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ భవానీ శంకర్ మాట్లాడుతూ.. యూపీఎస్సీని సాధించడం పెద్ద విషయమేమి కాదన్నారు. సీఎంఆర్ విద్యార్థులు బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్ రావు, గిరి ప్రకాశ్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రెండో దశలో మరో 4 మార్గాలను జత చేయండి

మెట్రో ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసిన మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఉత్తర హైదరాబాద్ ప్రాంతానికి మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు మెట్రో రెండో దశలో అదనంగా 4 మెట్రో కారిడార్‌లను చేర్చాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు మెట్రో ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి విన్నవించారు. నగర జనాభాలో సుమారు 40 శాతం వరకు ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలో నివాసం ఉన్నారని, వీరంతా ప్రజా రవాణా వ్యవస్థలపైనే ఆధారపడి ఉంటారన్నారు. అలాంటి వారి కోసం మెట్రో రైలు సౌకర్యాన్ని నిర్మించాలని కోరు